సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 31 । మార్చి । 2023




కనుల పండువగా తెప్పోత్సవం

ఖమ్మం పర్ణశాలలోని శ్రీసీతారాముల శోభాయాత్ర, తెప్పోత్సవం భక్తుల జయజయ ధ్వానాల నడుమ వైభవంగా సాగింది. 10లో




'పండిత'పామరుల సంత!

కామేపల్లి మండలం పండితాపురంలోని సంతకు పశువులు, మేకల కొనుగోళ్లు, అమ్మకాలతో ఖ్యాతి సాధించింది. 10లో



కల్యాణోత్సవం ముగిశాక భద్రాచలం ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



కల్యాణ వైభోగమే..

కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ చేస్తున్న అర్చకులు



సెల్‌ఫోన్‌లో కల్యాణాన్ని చిత్రీకరిస్తున్న యువతి



జీలకర్ర బెల్లం





మాంగళ్యధారణ



తలంబ్రాలు



స్వామివారికి భక్తితో నమస్కరిస్తూ..

- కనుల పండువగా సాగిన సీతారాముల కల్యాణం
- అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవార్లకు జీలకర్ర బెల్లం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఐకే రెడ్డి
- భక్తజనంతో పులకించిన భద్రగిరి
- మిథిలా స్టేడియంలో మార్మోగిన రామనామం

భద్రాచలం: త్రేతాయుగంలో స్వయంవరంలో సీతమ్మ చేయందుకున్న శ్రీరాముడు, కలియుగంలో జనహితం కోసం చైత్రశుద్ధ నవమి రోజున వివాహం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రామచంద్రస్వామి పుట్టిన పునర్వసు నక్షత్రంలోనే ఆయన సీతమ్మను పరిణయమాడడం విశేషం. దివి నుంచి భువికి దిగి వచ్చి భద్రుడికి దర్శనమిచ్చిన భద్రాచల దివ్యక్షేత్రంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తులు పులకించిపోయారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో గురువారం భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల వారి కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రామాలయంలో స్వామివారి మూలమూర్తులను దర్శించుకుని, తమ ఆరాధ్య దైవమైన శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు.

కల్యాణ తంతు సాగిందిలా..

స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రధాన ఆలయం నుంచి భక్తుల కోలాహలం నడుమ మంగళ వాయిద్యాలతో కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత భద్రాద్రి ఆలయ విశిష్టత, వైకుంఠ రాముని ప్రాశస్త్యాన్ని, భక్త రామదాసు, తూము నర్సింహదాసు సేవలు, రామదాసు చేయించిన బంగారు ఆభరణాల విశిష్టతను వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, త్రిదండి చినజీయర్ స్వామి, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఏఈఓ తులసీ ప్రసాద్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, భక్త రామదాసు పదో తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, తూము నర్సింహదాసు వంశస్థులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 11.59 గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీ సీతారాముల శిరస్సులపై అర్చకులు జీలకర్ర బెల్లం ఉంచారు. ఈ సమయంలో స్టేడియం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. మాంగళ్యధారణ అనంతరం స్వామి, అమ్మవార్లు ముత్యాల తలంబ్రాలను పోసుకునే వేడుకను జరిపించారు. శుక్రవారం జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలంటూ పండితులు ఈ వేడుక విశిష్టతను వివరించారు. కల్యాణం అనంతరం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని మండపం నుంచి పల్లకీలో ఊరేగింపుగా బయటకు తీసుకొచ్చారు. సతీ సమేతుడైన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లారు. కల్యాణోత్సవానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఏపీ స్పీకర్ తమ్మినేని సీతా రాం, ఏపీ మహిళా శిశు సంక్షేమ మంత్రి ఉషశ్రీ చరణ్, హైకోర్టు న్యాయమూర్తులు అభిషేక్‌రెడ్డి, శ్రీదేవి, భీమపాక నగేష్, నవీన్‌రావు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దైవజ్ఞ శర్మ, కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్ బందోబస్తును పర్యవేక్షించారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

భద్రాచలంలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి రూ.కోటి నిధులు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. లక్ష మంది భక్తులు వచ్చారని అంచనా వేస్తున్నాం. భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు. రాష్ట్ర, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశాం.

– ఇంద్రకరణ్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి

రాముడి జీవితం ఆదర్శనీయం

రాముడు మానువుడిగా పుట్టి, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించాడని, ఆయన అందించిన రామరాజ్యం పాలకులకు ఆచరణీయమని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. పాలకులు మంచి మనసు, సహృదయం, మంచి ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. సీతమ్మ జన్మించిన శోభకృత్ నామ సంవత్సరంలో శ్రీ సీతారాముల కల్యాణంతో పాటు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలను నిర్వహించుకోవడం సంతోషకరమని చెప్పారు.



స్వామివారి నామాలతో కొబ్బరిబొండాలు



ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులకు వస్త్రాలు, పండ్లు అందజేస్తున్న జీయర్‌స్వామి



కల్యాణవేడుకను తిలకిస్తున్న భక్తజనం

తెలంగాణ బిడ్డగా గర్వంగా ఉంది

తెలంగాణ బిడ్డగా పుట్టి హరియాణా గవర్నర్‌గా పనిచేస్తూ భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించటం గర్వంగా ఉంది. భద్రాచలంలో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించే సంవత్సరంలోనే అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరగటం సంతోషం. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి.

– బండారు దత్తాత్రేయ, హరియాణా గవర్నర్

ఈసారీ ఇక్కట్లు తప్పలేదు..

- శ్రీరామనవమి సందర్భంగా ఉభయదాతల పేరిట రూ.7,500 చొప్పున విక్రయించిన టికెట్ల ద్వారా ఇద్దరికి ప్రవేశం కల్పించారు. కానీ టికెట్ లేని పలువురిని ఈ సెక్టార్‌లోకి వచ్చారు. తీరా కల్యాణం మొదలయ్యాక టికెట్ కలి గిన వారు వచ్చేసరికి స్థలం లేక నిల్చోవాల్సి వచ్చింది.
- ఈసారి కల్యాణానికి వీఐపీలు తక్కువగానే వచ్చారు. దీంతో వీఐపీ సెక్టార్, సీఎం సెక్టార్లలో స్థలం ఉండడంతో ఉభయదాతల టికెట్లు తీసుకున్న వారిని అనుమతించే అవకాశమున్నా ఎవరూ చొరవ తీసుకోలేదు. పైగా ఈ రెండు సెక్టార్లను పోలీసులు తమ కుటుంబ సభ్యులు, పరిచయస్తులతో నింపేశారు. వీరి తాకిడికి ఆలయం నుంచి మిథిలా స్టేడియానికి చేరుకునే మార్గం కిక్కిరిసిపోయింది.
- సెక్యూరిటీ పేరుతో మితిమీరిన ఆంక్షలు విధించడంతో బ్రిడ్జి సెంటర్ నుంచి ఆలయం వరకు నడిచి వచ్చేందుకు వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, పిల్లలు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. కల్యాణం ముగిశాక ఎండ తాళలేక కనిపించిన చోటల్లా విశ్రాంతి తీసుకుంటూ ముందుకు కదిలారు.
- కల్యాణం వీక్షించేందుకు ఆసక్తి చూపే సామాన్య భక్తులతో మిథిలా స్టేడియం కళకళలాడేది. కానీ ఆంక్షల కారణంగా లోపలికి ఎలా రావాలో తెలియక కరకట్ట వెంట, చెట్ల నీడలో ఉండిపోయారు. కనులారా కల్యాణం చూసుకోలేకపోయామని నిరాశ చెందారు.
- ట్రాఫిక్ నియంత్రణలో పటిష్ట విధానం లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సెక్టార్ల వారీగా వాహనాలను వదలడం, హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడం, వన్‌వేలపై దృష్టి సారించలేదు. పైగా కల్యాణం ముగియగానే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు వెళ్లిపోవడంతో మిగిలిన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ కష్టమైంది.
- దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో మిథిలా స్టేడియానికి వచ్చేసరికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ అనుదీప్ అక్కడ లేరు. దీంతో మంత్రి కొద్దిసేపు అక్కడే వేచి చూడాల్సి వచ్చింది.
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఇతర వీఐపీలు కల్యాణానికి వస్తారనే అంచనాతో ఐటీసీ గెస్ట్ హౌస్‌లో పది గదులు రిజర్వ్ చేశారు. వీరి పర్యటన రద్దయినా గదులను రిలీజ్ చేయకపోవడంతో వసతి కొరత ఏర్పడింది
- విజిలెన్స్ శాఖ ఉదాసీనంగా వ్యవహరించడంతో భద్రాచలంలో నకిలీ ప్రసాదాలు విక్రయించినట్లు ఫిర్యాదులు అందాయి. దేవస్థానం సిబ్బంది తనిఖీల్లో నిత్యాన్నదాన సత్రం దగ్గర నకిలీ లడ్డూలు విక్రయిస్తున్న ముఠా పట్టుబడింది.
- వెహికల్ పాస్‌లు బుధవారం అర్ధరాత్రి వరకు జారీ చేయకపోవడంతో చాలామంది ఇబ్బంది పడ్డారు.
- నవమి విధుల్లో ఉన్న అధికారులు ఎక్కడ బస చేయాలనే అంశంపై బుధవారం రాత్రి వరకు స్పష్టత కరువైంది. దీంతో చాలామంది అధికారులు సొంతూళ్లకు వెళ్లి గురువారం ఉదయం తిరిగి వచ్చారు. ఫలితంగా కీలక సమయంలో వారు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది.
- విధులు కేటాయించిన 300మంది ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం సాయంత్రం ఏడు గంటలకే సెక్టార్లకు రావాల్సి ఉన్నా రాత్రి వరకు డ్యూటీ పాస్‌లు జారీ చేయలేదు. దీంతో వారంతా పాస్‌ల కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు.

– భద్రాచలం/బూర్గంపాడు/భద్రాచలంటౌన్/అశ్వాపురం

న్యూస్‌రీల్

పారదర్శకంగా పంట నష్టం సర్వే



కొణిజర్ల : చిన్నమునగాలలో సర్వేపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

కొణిజర్ల/బోనకల్: ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల సర్వే పారదర్శకంగా చేపట్టి ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలని అదనపు కలెక్టర్ స్నేహలత ఆదేశించారు. మండలంలోని చిన్నమునగాలలో పంటల సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఏ ప్రతిపాదికన సర్వే చేస్తున్నారు, పంటల నష్టం ఎలా అంచనా వేస్తున్నారనే అంశాలను తెలుసుకుని ఉద్యోగులకు సూచనలు చేశారు. ఐదు రోజుల్లో సర్వే పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని, రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకోవాలని తెలిపారు. డీఏఓ ఎం.విజయనిర్మల, ఏడీఏ వి.బాబూరావు, తహసీల్దార్ దొడ్డారపు సైదులు, ఉద్యోగులు ఏ.శ్రీనివాస్, బాలాజీ పాల్గొన్నారు. అలాగే, బోనకల్ మండలం ముష్టికుంట్ల, బోనకల్, రాయనపేటల్లో దెబ్బతిన్న పంటల సర్వేను జెడ్పీసీఈఓ వీవీ.అప్పారావు పరిశీలించారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటల వివరాలు మాత్రమే సేకరించాలని సూచించారు. ఎంపీడీఓ బోడేపూడి వేణుమాధవ్, ఏఓ అబ్బూరి శరత్‌బాబు, ఏఈఓలు త్రివేణి, సాధన, నాగసాయి పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీలో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి

- సింగరేణి చరిత్రలో ఇదే ప్రథమం!



జేవీఆర్ ఓసీ వ్యూ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ శుక్రవారంతో వార్షిక లక్ష్యం 10 మిలియన్ టన్నులు పూర్తి చేయనుంది. సంస్థ కేటాయించిన లక్ష్యంలో గురువారం నాటికి 99.67 లక్షల ఉత్పత్తి పూర్తయింది. ఇక ఆర్థిక సంవత్సరం చివరి రోజైన శుక్రవారం 33వేల టన్నుల ఉత్పత్తి జరిగితే లక్ష్యం మేరకు 10 మిలియన్ టన్నులు పూర్తిచేసినట్లవుతుంది. సింగరేణి సంస్థ 133 ఏళ్ల చరిత్రలో ఏ గని కూడా ఇంత మొత్తం ఉత్పత్తి సాధించిన దాఖలాలు లేవని చెబుతున్నారు. ఈ నేపథ్యాన జేవీఆర్ ఓసీ కార్మికులు, అధికారులను ఏరియా జీఎం జక్కం రమేష్ తదితరులు అభినందించారు.

నేడు సామ్రాజ్య పట్టాభిషేకం

- 12 ఏళ్లకు ఒకసారి ఈ వేడుక
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- మిథిలా స్టేడియంలో నేటి మధ్యాహ్నం 12 గంటలకు క్రతువు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ తమిళిసై



నెమలి దండతో స్వామివారి ఉత్సవమూర్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/భద్రాచలం: కోదండ రాముడి పుష్కర పట్టాభిషేకానికి భద్రగిరి సిద్ధమైంది. వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి మరుసటి రోజు పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుక శుక్రవారం మిథిలా స్టేడియంలో జరుగనుండగా గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

ఉదయం 9:30 గంటల నుంచే..

త్రేతాయుగంలో శ్రీరాముడి మహాపట్టాభిషేకం స్మరణకు వచ్చేలా అదే చైత్ర పుష్యమి ముహూర్తాన భద్రాచలంలో పట్టాభిషేకం జరుపుతారు. అందులో భాగంగా నేడు ఉదయం యాగశాలలో చతుఃస్థానార్చన హోమం నిర్వహిస్తారు. 10 గంటల సమయంలో శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, కోలాటం, భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ ప్రత్యేక పల్లకీలో మిథిలా స్టేడియంలోని మండపానికి తీసుకొచ్చి సింహాసనంపై వేంచేపు చేస్తారు. ఆ తర్వాత విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేసి మంత్రజలంతో పూజలో ఉపయోగించే వస్తువులు, ప్రాంగణాలను సంప్రోక్షణ చేస్తారు.

మూడు ఉప మండపాల ఏర్పాటు..

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాలు ఏర్పాటు చేస్తారు. ఒక మండపంలో హనుమంతుడు, సుగ్రీవుడు సహా ఎనిమిది మంది రామపరివారం, అష్టదిక్పాలకులను, మధ్య మండపంలో మంత్రజలంతో 500 నదులు, నాలుగు సముద్రాల జలాలను ఆవాహన చేస్తారు. ఈసారి దేశంలో వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన 12 నదీ జలాలతో కూడిన కలశాలను ఏర్పాటు చేస్తారు. మూడో మండపంలో శ్రీరాముడికి సంబంధించిన రాజముద్ర, రాజదండం, పాదుకలు ఉంచుతారు. అనంతరం అష్టోత్తర సహస్రనామార్చన, సువర్ణ పుష్పార్చన చేస్తారు. మండపంలో పంచకుండాత్మక–పంచేష్టి సహిత చతుర్వేద హవన పురస్కృతంగా మండపత్రయ ఆరాధన గావిస్తారు.

ఎనిమిది మంది మంత్రులుగా..

త్రేతాయుగంలో రామచంద్రమూర్తికి పట్టాభిషేకం నిర్వహించిన వశిష్ఠుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడులను వేద మంత్రాల నడుమ ప్రస్తుత అర్చకుల్లో ఆవాహన చేస్తారు. అనంతరం ఈ ఎనిమిది మంది అర్చకులు పట్టాభిషేకం నిర్వహణకు సిద్ధమవుతారు. వీరికి నేతృత్వం వహించేందుకు వాల్మీకీ స్థానాన్ని మరొకరు వరింపజేసుకుంటారు.

యుద్ధకాండలోని 101 శ్లోకాలను పఠిస్తూ..

పట్టాభిషేకంలో కీలకమైన కిరీటధారణకు ముందు రామాయణంలోని యుద్ధకాండ పట్టాభిషేక పారాయణంలో ఉన్న 101 శ్లోకాలను పఠిస్తారు. అనంతరం రాజాధిరాజా అంటూ శ్రీరాముడి విశిష్టతలు వివరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ ముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణపాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్ర కిరీటాలను స్వామివారికి ప్రదానం చేస్తారు. పూర్తిగా రాజలాంఛనాలతో సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి అలంకరిస్తారు. సంప్రదాయం ప్రకారం పట్టాభిషేక వేడుకలకు గవర్నర్ తమిళిసై హాజరై పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

మళ్లీ 2035లోనే..

రామరాజ్య స్థాపన లక్ష్యంగా శ్రీరామపట్టాభిషేకం ఏటా నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. 12 ఏళ్లకు ఒకసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది. ఈ వేడుకను 2011లో నిర్వహించగా, తిరిగి ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మళ్లీ 2035లో పుష్కర పట్టాభిషేకం జరగనుంది. ఇక 60 ఏళ్లకు ఓసారి జరిగే మహాసామ్రాజ్య పట్టాభిషేకం 1987లో జరిగింది. తిరిగి ఈ వేడుకలు 2046లో నిర్వహిస్తారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి పోటీలు

- జీళ్లచెరువులో ఎడ్ల బలప్రదర్శన, ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యేలు ఉపేందర్‌రెడ్డి, సండ్ర, ఎమ్మెల్సీ మధు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కందాల, సండ్ర, ఎమ్మెల్సీ మధు (ఇన్‌సెట్) కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి ఒంగోలు గిత్తల బండలాగుడు బలప్రదర్శన, మహిళల ప్రో కబడ్డీ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఇంటూరి శేఖర్ యువసేన ఆధ్వర్యాన ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. పోటీలను పాలేరు, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్లుగా జీళ్లచెరువులో ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, బోడ మంగీలాల్, వజ్జ రమ్య, జీళ్లచెరువు సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమ, నాయకులు పాల్గొన్నారు.

- **సత్తాచాటిన ఒంగోలు గిత్తలు :** తొలిరోజు వ్యవసాయ విభాగంలో 1.5 టన్నుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజుపాలెం, కంచనపల్లి, అమరావతి, వేటపాలెం, తెలంగాణలోని నల్లగొండ, చింతలపాలెం ప్రాంతాలకు చెందిన గిత్తలు పోటీలో పాల్గొని సత్తా చాటాయి.
- **హోరాహోరీగా ప్రో కబడ్డీ :** జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ప్రో కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. తొలిసారిగా ఇక్కడ ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించడంతో తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, క్రీడాకారులు తరలివచ్చి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

వెల్లివిరిసిన మతసామరస్యం


సీతారాముల కల్యాణ వేడుక..

దర్గాలో కల్యాణం..

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారు హజరత్ నాగుల్‌మీరా దర్గా చిల్లాలో సీతారాముల కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. చలువ పందిరి వేసి పచ్చని తోరణాలు కట్టి వేడుకలు జరిపారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ పెళ్లి జరపగా, దర్గా ప్రతినిధులు కులమతాలకు అతీతంగా సీతారాములకు ప్రత్యేక పూజ చేశారు. శుక్రవారం పట్టాభిషేక మహోత్సవం కూడా నిర్వహించనున్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ముస్లింలు


సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు తెస్తున్న మహబూబ్ షా కుటుంబం

చుంచుపల్లి: విద్యానగర్ పంచాయతీలో గురువారం జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. అదే ప్రాంతంలో నివాసముంటున్న ముస్లిం ప్రభుత్వ ఉద్యోగి మహబూబ్ షా కుటుంబ సభ్యులతో కలిసి సీతారాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. వారు ఏటా కల్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడంతో పాటు పూజలో కూర్చుంటున్నారు.

అన్నదాన సేవలు..


వడ్డిస్తున్న ముస్లింలు

సుజాతనగర్: సుజాతనగర్‌లో గురువారం జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ముస్లింలు భాగస్వాములమయ్యారు. 25 కిలోల బియ్యం వితరణ చేయడంతోపాటు ఆలయంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. రంజాన్ ఉపవాసం ఉంటూనే రామయ్య భక్తులకు సేవలందించి మతసామరస్యం చాటారు.

కనులారా వీక్షించి..

తన్మయత్వం పొందిన భక్తజనులు



భద్రగిరి భక్తజనసంద్రంగా మారింది. మిథిలా స్టేడియం శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. అశేష జన వాహినితో కొత్త శోభ సంతరించుకుంది. గోదావరి తీరం పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఉప్పొంగిన భక్తిభావంతో తన్మయత్వం పొందారు. భద్రాచలం రామయ్య పెళ్లి చూడటం ఎంతో పుణ్యఫలం అనుకుంటూ తిరుగు పయనమయ్యారు.


భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

భద్రాచలంటౌన్/అశ్వాపురం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులకు తగిన విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భద్రాచలంలో గురువారం జరిగిన రామయ్య పెళ్లికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనులను ‘సాక్షి’ పలకరించగా.. వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారుల పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక కుళాయిలు, మరుగుదొడ్లు పనిచేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండలో టెంట్ల కింద ఉండలేక కరకట్ట పక్కన చెట్ల కింద సేదతీరారు. అయితే మరికొందరు మాత్రం ఏర్పాట్లు బాగున్నాయని పేర్కొన్నారు.

అన్నదానం, పానకం..

భద్రాచలంలో దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, వ్యాపారులు, యూనియన్ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం చేశారు. మజ్జిగ, పానకం, తాగునీరు పంపిణీ చేశారు.


పట్టణంలో మజ్జిగ పంపిణీ

బస్టాండ్‌లో గంటల తరబడి..

కల్యాణం అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సుల్లేక భక్తులు ఇక్కట్లపాలయ్యారు. బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. భక్తులతో ఆవరణ కిక్కిరిసిపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు, చంటి పిల్లలతో వచ్చిన మహిళలు అవస్థపడ్డారు. ఏపీ రాష్ట్రంలో పలు ప్రాంతాల బస్సులు బస్టాండ్‌లో ప్లాట్‌ఫారమ్‌పైకి రాకపోవడంతో బస్సుల్లేవనుకుని భక్తులు కంగారుపడ్డారు. దొంగలుంటారని ఒకవైపు డిపో సిబ్బంది అప్రమత్తం చేస్తున్నా మరోవైపు చోరులు చేతివాటం ప్రదర్శించారు. పలువురు భక్తులు తమ వస్తువులు పోగొట్టుకున్నారు.


ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిట..


భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ గేట్ వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్‌కు క్లచ్ ఫెయిల్..

ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద సత్తుపల్లికి డిపోకు చెందిన ఏలూరు వెళ్లే బస్సు క్లచ్ ప్లేట్లు ఫెయిలై నిలిచిపోయింది. దీంతో సుమారు గంటపాటు మిగతా బస్సులు బస్టాండ్‌లోనే ఆగిపోయాయి. ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేపట్టి బస్సును పక్కకు తీయడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మండుటెండల్లో..

భక్తులు మండుటెండల్లో తీవ్ర అవస్థలు పడ్డారు. చెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద సేదతీరారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన మజ్జిగ, పానకం, తాగునీరు పంపిణీ కేంద్రాలతో ఎండ నుంచి కొంత ఉపశమనం పొందారు. సారపాక నుంచి భద్రాచలం వరకు విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఎండల్లో అవస్థలు పడ్డారు. ఆలయ కౌంటర్లలో సిబ్బందికి ఇక్కట్లు తప్పలేదు.



మహిళలకు ఇబ్బందిగా ఉంది



మా ఊరి నుంచి సుమారు ఇరవై కుటుంబాలవారం రామయ్య కల్యాణానికి వచ్చాం. కానీ ఇక్కడ మహిళా భక్తులకు సౌకర్యాలు అంతగా లేవు. నదిస్నానం చేసి అనంతరం దుస్తులు మార్చుకునే గదులు సరిగా లేవు. మరుగుదొడ్ల ఏర్పాట్లు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. రామయ్య కల్యాణం కనులారా తిలకించామనే సంతృప్తితో వెళ్తున్నాం.

–ముచ్చు లక్ష్మి, కైకలూరు, ఏలూరు జిల్లా

ఏర్పాట్లు బాగున్నాయి



సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అధికారులు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ఐదేళ్ల క్రితం కల్యాణానికి భద్రాచలం వచ్చా. కరోనా అనంతరం మళ్లీ ఇప్పుడే వచ్చా. అప్పటికి ఇప్పటికి చాలా మార్పు ఉంది. సెక్టార్లలో భక్తులకు మజ్జిగా, బిస్కెట్లు ఏర్పాటు చేశారు. రామయ్య కల్యాణం దగ్గర నుంచి చూడటం సంతోషంగా ఉంది.

–సంపత్ గౌడ్, చెన్నూరు, మంచిర్యాల

చిన్న ఎల్‌ఈడీల్లో కల్యాణం కనిపించలే..



రామయ్య కల్యాణానికి మా ఊరి నుంచి నలుగురం స్నేహితులం వచ్చాం. కల్యాణ వేదిక వద్దకు వెళ్లే అవకాశం లేదు. ఎల్‌ఈడీ స్క్రీన్స్‌పైనే తిలకించాం. చిన్న స్క్రీన్స్ పెట్టడంతో కల్యాణం సరిగా చూడలేకపోయాం. అధికారులు దూరం నుంచి చూసే భక్తులకు పెద్ద స్క్రీన్స్ పెడితే బాగుండేది.

–శివ, రాజాపూర్, కరీంనగర్

అదనంగా వసూలు చేశారు..



ప్రతి ఏడాది శ్రీరామనవమికి భద్రాచలం వస్తా. గోదావరి వద్ద తలనీలాలకు రూ.50 టికెట్ తీసుకోగా మళ్లీ రూ.50 నుంచి 100 వసూలు చేస్తున్నారు. టికెట్ తీసుకున్నాక కూడా రూ.50, 100 ఇవ్వాలంటే ఇబ్బందే కదా!

–మునిగాల కృష్ణ, జమ్మికుంట, కరీంగనగర్ జిల్లా

తలంబ్రాలు దొరకలేదు..



భద్రాచలంలో ఉదయం దర్శనం చేసుకుని పర్ణశాల వెళ్లాం. అక్కడ కల్యాణం చూసి మధ్యాహ్నం భద్రాచలం వచ్చాం. తలంబ్రాల కోసం పలు కౌంటర్లు తిరినా దొరకలేదు. అయిపోయాయని సిబ్బంది చెప్పారు. వేడుకలకు అధికారులు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి.

–వినుకొండ కేశవరెడ్డి, కరీంనగర్

భోజనాలకు ఇబ్బంది పడ్డాం



భద్రాద్రి రాముల వారిపై భక్తితో కర్నూలు నుంచి కుటుంబసమేతంగా మూడు రోజుల క్రితం భద్రాచలం వచ్చాం. దర్శనం, ఏర్పాట్లు బావున్నాయి. స్వామివారి కల్యాణానికి సీఎం కేసీఆర్ వస్తే బాగుండేది. మూడు రోజులు అన్నదానసత్రాల వద్ద భోజనం కోసం ఇబ్బందులు పడ్డాం.

–కదవల రాములు, పత్తికొండ, కర్నూలు జిల్లా

ఏర్పాట్లు బాగున్నాయి



భద్రాచలంలో శ్రీరామనవమికి మొదటిసారి వచ్చా. స్వామి వారి దర్శనం చేసుకొని కల్యాణం చూశాను. భద్రాచలంలో అన్ని ఏర్పాట్లు బాగున్నాయి. ఎక్కడా ఇబ్బంది కలగలేదు. రామయ్య కల్యాణం చూడటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– హనుమంతరావు, గుంతకల్లు, అనంతపురం జిల్లా

ట్రాఫిక్‌తో కల్యాణం చూడలేకపోయా..



స్వామివారి కల్యాణానికి పామర్రు నుంచి వచ్చాం. కానీ ట్రాఫిక్ సమస్యతో చూడలేకపోయాను. మొదటిసారి భద్రాచలం రావడంతో కల్యాణ వేదిక వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సామాన్య భక్తులు కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేయలేదు. ఏదేమైన రామయ్య నడయాడిన నేలకు రావడం అదృష్టంగా భావిస్తున్నాం.

–టి.వేణు, పామర్రు మండలం, కృష్ణాజిల్లా


హరియాణా గవర్నర్ దత్తాత్రేయతో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్


చిన్నారికి ఉక్కపోత లేకుండా..


కల్యాణానికి వస్తున్న చినజీయర్ స్వామి, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య


కల్యాణానికి వస్తున్న హైకోర్టు జడ్జి


ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ..


చెట్టు కింద సేద తీరుతున్న భక్తులు



గోదావరి నదిలో దీపాలను వదులుతున్న మహిళలు, పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

అట్టహాసంగా ‘లవ్ యు రామ్’ సినిమా వేడుక

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద గురువారం ‘లవ్ యు రామ్’ సినిమా వేడుక నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా లకారం ట్యాంక్ బండ్‌లో శ్రీసీతారాముల తెప్పోత్సవం జరిగింది. ఈ వేడుకలకు హాజరైన హీరో కిరణ్ అబ్బవరంతో పాటు లవ్ యు రామ్ హీరో, హీరోయిన్లు రోహిత్ బెహల్, అపర్ణ జనార్దన్ సందడి చేశారు. ఇక నటీనటులు, గాయకులు, నృత్యకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కాగా, సినీ యూనిట్‌ను ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు అభినందించారు.

రెండేళ్ల క్రితం తమ్ముడు.. నేడు అన్న మృతి

రెండు ఘటనలూ శ్రీరామ నవమి నాడే...


వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

వైరారూరల్: ఊరూవాడ శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకుంటుండగా.. ఆ కుటుంబానికి మాత్రం విషాదం మిగిలింది. రెండేళ్ల క్రితం శ్రీరామనవమి రోజున తమ్ముడు కోవిడ్‌తో మృతి చెందగా.. ఈసారి శ్రీరామనవమి నాడే కేన్సర్‌తో వ్యాధితో బాధపడుతున్న అన్న మృతి చెందాడు. వైరా మండలం గరికపాడుకు మాజీ సర్పంచ్ శీలం కరుణాకర్‌రెడ్డి 2021 ఏప్రిల్‌లో కరోనా బారిన పడగా చికిత్స పొందుతూ అదే నెల 21న(శ్రీరామనవమి) మృతి చెందాడు. అదే నెల 30వ తేదీన కరుణాకర్ భార్య హరితకూడా మృతి చెందింది. ఇక ఖమ్మంలో వ్యాపారం చేస్తున్న కరుణాకర్ అన్న వెంకటేశ్వరరెడ్డి బ్లడ్ కేన్సర్ బారిన పడగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, వెంకటేశ్వరరెడ్డి కుమారుడు సాయి లక్ష్మారెడ్డి అమెరికాలో ఎమ్మెస్ చదువుతున్నారు. తండ్రి కేన్సర్ బారిన పడడంతో గత ఏడాది జూన్‌లో వచ్చి ఆరు నెలల పాటు ఇక్కడే ఉండి డిసెంబర్‌లో వెళ్లాడు. ఇప్పుడు వెంకటేశ్వరరెడ్డి మృతి చెందిన విషయాన్ని ఆయనకు ఫోన్‌లో చెప్పినా మళ్లీ వచ్చే అవకాశం లేక కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నాడు. ఇక ఇద్దరు కుమారులు శ్రీరామనవమి రోజునే మృతి చెందడంతో వారి తల్లి నాగమ్మ రోదిస్తున్న తీరుతో గ్రామస్తులంతా కంటతడి పెట్టారు.

దేవుడి ఊరేగింపులో రాజకీయం

రెండు వర్గాల ఆధ్వర్యాన కల్యాణం, ఆపై గొడవ

బోనకల్: మండలంలోని ఆళ్లపాడులో గురువారం శ్రీసీతారాముల కల్యాణోత్సవం అనంతరం రాత్రి నిర్వహించిన దేవుడి ఊరేగింపులో ఇరువర్గాలు గొడవ పడడంతో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుచోట్ల జరిపించారు. బీఆర్‌ఎస్ నాయకులు బొడ్రాయి సెంటర్ వద్ద, కాంగ్రెస్ మద్దతుదారులు ఆంజనేయస్వామి గుడి వద్ద చేశారు. ఆతర్వాత రెండు వర్గాల వారు డీజే శబ్దాలతో ఊరేగింపు నిర్వహిస్తూ బొడ్రాయి సెంటర్ వద్ద ఎదురుపడ్డారు. దీంతో తోపులాటకు దిగడంతో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు చెదరగొట్టారు. కాగా, కాంగ్రెస్ ఆధ్వర్యాన ఊరేగించిన చేసిన విగ్రహాలను బొడ్రాయి సెంటర్ వద్ద ఉన్న రామాలయంలో పెట్టేందుకు వెళ్లేసరికి తాళం వేసి ఉండడంతో నిరసన తెలిపారు. అంతేకాక బీఆర్‌ఎస్ నాయకుల విగ్రహాలను ఆంజనేయ స్వామి గుడి వైపు రానివ్వమని కాంగ్రెస్ నాయకులు బైఠాయించారు. దీంతో ఎస్‌ఐ తేజావత్ కవిత చేరుకుని నచ్చచెప్పినా ఇరువర్గాల విగ్రహాలను రామాలయంలోనే పెట్టాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో కాంగ్రెస్ నాయకులు వేల్పుల రమేష్ గాయపడినట్లు ఆరోపించారు. చివరకు బీఆర్‌ఎస్ నాయకులు తీసుకొచ్చి న ఉత్సవ విగ్రహాలను రామాలయంలో పెట్టగా, కాంగ్రెస్ నాయకులు తీసుకొచ్చిన విగ్రహాలు మాత్రం రాత్రి వరకే బయటే ఉండిపోయాయి.


ఆలయం బయట ట్రాక్టర్‌లో విగ్రహాలు

ఎక్స్‌రే ప్లాంట్ పనిచేయక ఇబ్బందులు

పెనుబల్లి : పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ పనిచేయక ప్రజలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎక్స్‌రే ప్లాంట్‌కు విద్యుత్తు సరఫరా చేసే సీపీయూ యూనిట్ మరమ్మతుకు రావడంతో నెల రోజులుగా యూనిట్ మూలనపడింది. ఈ ఆస్పత్రిలో ప్రత్యేక ఎముకల వైద్య నిపుణులు ఉండడంతో నమ్మకంగా వస్తున్న వారు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇకనైనా విద్యుత్ సౌకర్యం కల్పించి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పంపు ఆపరేటర్ నిర్బంధం

కారేపల్లి: నాలుగేళ్లుగా తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదనే ఆవేదనతో పంప్ ఆపరేటర్‌ను నిర్బంధించిన ఘటన మండలంలోని గాజులతండా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. భాగ్యనగర్‌తండా గ్రామ పంచాయతీ అధికారులు డైరెక్ట్ పంపింగ్ బోరు ద్వారా వచ్చే నీళ్లను తమ గ్రామానికి అందించటం లేదని గాజుల తండా వాసులు వాపోతున్నారు. ఈవిషయమై ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గురువారం వచ్చిన పంప్ ఆపరేటర్ అజ్మీరా హేమచందర్‌ను గదిలో నిర్బంధించి నిరసన తెలిపారు. ఆతర్వాత అధికారులు సర్దిచెప్పడంతో వారు ఆయనను వదిలేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలుకు చెందిన కుడుముల వెంకటరెడ్డి(31) ఆర్థిక ఇబ్బందులు తాళలేక గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాలరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరెడ్డి కొంతకాలంగా ఆర్థికపరమైన సమస్యతో ఇబ్బంది పడుతుండగా, తొండలగోపవరం - ఎర్రుపాలెం స్టేషన్ల మధ్య షిర్డీ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుడు మునుగోటి నర్సింహారావు ఆధ్వర్యాన మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకట్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లుప్తంగా...


తిరుమంజనంలో సేద తీరుతున్న సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారు

శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీరాముడు తన భక్తుడైన హనుమంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమంతవాహన సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.

ఏపీలో 4 రోజులు తేలికపాటి వానలు

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో మరో నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చెదురుమదురుగా వానలు పడుతున్నాయి. ప్రస్తుతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, కర్ణాటకల మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ గురువారం తెలిపింది. అదే సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేటలో 2.6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లా నూతనకల్వలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఒంటిమిట్టలో మార్మోగిన రామనామ స్మరణ

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా రామనామ స్మరణ మార్మోగింది. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సతీసమేతంగా శ్రీకోదండరామస్వామికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీరామనవమి కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

'మార్గదర్శి' అక్రమాలు నిజం!

▶ మొదటి పేజీ తరువాయి

అప్పటికే వేరే సంస్థల ఖాతాల్లోకో, ఇతరత్రా అవసరాలకో మళ్లించేశారు. కానీ... అవన్నీ తమ వద్దే ఉన్నట్లుగా తప్పుడు బ్యాలెన్స్‌షీట్ ద్వారా మభ్యపెడుతున్నారు. తమ సంస్థ తగిన ఆస్తులతో బలంగానే ఉన్నదని ఒక వైపు చిట్లు వేస్తున్న చిట్‌దారులను, మరో వైపు నియంత్రణ సంస్థలను నమ్మిస్తున్నారు. ఇదీ.. రామోజీరావు నడిపిస్తున్న 'మార్గదర్శి'అసలు కథ. మార్గదర్శి సంస్థను ఆడిట్ చేస్తున్న ఆడిటింగ్ సంస్థల ప్రతినిధి నేరుగా దర్యాప్తు సంస్థ ఎదుట అంగీకరించిన వాస్తవం. ఇదే కాదు. తనిఖీలకు అడుగడుగునా అడ్డుపడుతున్న మార్గదర్శిలో... ఎక్కడ ఏ సోదా జరిపినా నివ్వెరపోయే నిజాలే వెలుగుచూస్తున్నాయి. వాస్తవాలను బయటకు వెల్లడించకపోవటం ద్వారా... చిట్లు వేస్తున్నవారికి తమ సొమ్ము ఎంత భద్రంగా ఉందో, లేదో కూడా తెలియని పరిస్థితి సృష్టిస్తున్నారు. అంతేకాదు.. డిపాజిట్లు తీసుకోవటాన్ని నిషేధించినా సరే... వాటిని ఇతరత్రా రూపాల్లో తీసుకుంటూ నిబంధనలకు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. చట్టాలను పరిహాసం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఆడిటింగ్ సంస్థ బ్రహ్మయ్య అండ్ కో కంపెనీలో సీఐడీ జరిపిన తనిఖీల్లో వెల్లడైన పలు అక్రమాలు బయటపడ్డాయి.

చార్టర్డ్ అకౌంటెంట్‌కు 14 రోజుల రిమాండ్..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాంకు లావాదేవీలు, రికార్డుల నిర్వహణలో పలు అవకతవకలున్నట్లు మార్గదర్శి చిట్స్‌కు ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కో ప్రతినిధి సీఐడీ విచారణలో వెల్లడించారు. దాంతో బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్‌ను సీఐడీ అధికారులు అరెస్టు చేసి గురువారం విజయవాడలోని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా... చందాదారుల సొమ్మును తరలించటం, మ్యూచువల్ ఫండ్స్‌లో, షేర్లలోనూ అక్రమంగా పెట్టుబడులు పెట్టడం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు సేకరించడం చేసినట్లు ఇప్పటికే సీఐడీ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే బ్రహ్మయ్య అండ్ కో సంస్థ రికార్డులను తనిఖీ చేసి, ఆ సంస్థ సీఏ శ్రావణ్‌ను విచారించారు. ఈ విచారణలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. మార్గదర్శి ఖాతాలు సవ్యంగానే ఉన్నాయని ఏటా ఆడిట్ నివేదిక ఇస్తున్న ఈ సంస్థ... అసలు మార్గదర్శి చిట్స్ బ్యాంకు ఖాతాలు, రికార్డులు, లావాదేవీలను సమగ్రంగా పరిశీలించకుండానే ఈ నివేదిక ఇస్తున్నట్లు సదరు చార్టర్డ్ అకౌంటెంట్ వెల్లడించటం గమనార్హం.

ఇలాంటి డిపాజిట్లు ప్రమాదకరమే?

■ చిట్లు వేసేవారిలో కొందరు చిట్‌ను పాడుకుంటారు కానీ... ఆ డబ్బును తీసుకోవటానికి అవసరమైన ష్యూరిటీలను కంపెనీకి సబ్‌మిట్ చేయలేరు. మరికొందరైతే రకరకాల కారణాల వల్ల పాడుకున్న మొత్తాన్ని తీసుకోకుండా భవిష్యత్తులో తాము చెల్లించాల్సిన చిట్ మొత్తానికి సంబంధించి దాన్ని సదరు చిట్‌ఫండ్ సంస్థ వద్దే వదిలిపెడతారు. ఇంకొందరైతే ఓ రెండు మూడు నెలలు ఉన్నపుడు చిట్‌ను పాడుకుని... ఆ మిగిలిన నెలల ఫ్యూచర్ చిట్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని సంస్థ దగ్గరే వదిలేస్తారు. అయితే ఏ చిట్‌ఫండ్ సంస్థయినా తమ ప్రతి బ్రాంచి కార్యాలయంలోనూ... అక్కడి చిట్టీలకు సంబంధించిన ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని జమ చేసేందుకు ప్రత్యేకంగా రెండో బ్యాంకు ఖాతాను నిర్వహిస్తుండాలి. ఇలా ఫ్యూచర్ చిట్ల మొత్తాన్ని ఆ ఖాతాలో జమ చేయాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఏ ఒక్క బ్రాంచిలోనూ ఇలా ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి వేరే బ్యాంకు ఖాతా తెరవలేదు. అన్నిచోట్ల నుంచీ ఆ మొత్తాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలిస్తోంది. దానికో రశీదు ఇస్తూ 4–5 వడ్డీ చెల్లిస్తోంది. ఇది అనధికారికంగా డిపాజిట్లు వసూలు చేయటమే. చట్టవిరుద్ధంగా వసూలు చేస్తున్న ఈ డిపాజిట్లను గనక ఏ ఆర్‌బీఐనో జప్తు చేస్తే..? చిట్‌దారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉంది. అయినా సరే మార్గదర్శి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లు సక్రమమేననే రీతిలో బ్రహ్మయ్య అండ్ కో సంస్థ నివేదిక ఇవ్వటం విస్మయం కలిగించేదే!!.

■ ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల ఖాతాలు, తమ పెట్టుబడులు వివరాలను బహిర్గతం చేయటం లేదు. గోప్యంగా ఉంచుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. అయినా సరే బ్రహ్మయ్య అండ్ కో ఇది పట్టించుకోకుండా అంతా సక్రమంగానే ఉందని ఆడిట్ నివేదిక ఇచ్చేస్తోంది.

అక్రమాలు వాస్తవమే: బ్రహ్మయ్య సంస్థ సీఏ శ్రావణ్

సీఐడీ దర్యాప్తు సందర్భంగా బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్ కీలక విషయాలు వెల్లడించారు. తాము అసలు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో రికార్డులను వ్యక్తిగతంగా పరిశీలించకుండానే ఆడిట్ నివేదిక జారీ చేస్తున్నామని అంగీకరించారు. మార్గదర్శి చిట్స్ ఆదాయ–వ్యయాలు, ఆస్తి– అప్పులకు సంబంధించిన ఎలాంటి వివరాలనూ ఆయన సీఐడీ అధికారులకు చెప్పలేకపోయారు. ఒక్కో బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో అప్పుడప్పుడు చూపిస్తున్న వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ తరువాత అవి ఎక్కడికి మాయమయ్యాయి? అనేది ఆయన ఏమాత్రం చెప్పలేకపోయారు. ఆ వివరాలేవీ తనకు తెలియవని ఆయన అంగీకరించారు.

ఆర్థిక నగరాల నిర్మాణంపై వ్యూహాలు

- సామర్థ్యం నిర్మాణంపై వర్క్‌షాపులో జీ–20 దేశాల సమర్పణ

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తులో స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణంపై జీ–20 దేశాల ప్రతినిధులు తమతమ వ్యూహాలను సమర్పించారు. విశాఖపట్నంలో జరుగుతున్న జీ–20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సమావేశాల్లో మూడోరోజైన గురువారం 'సామర్థ్య నిర్మాణం'పై వర్క్‌షాపును ఇండియన్ ప్రెసిడెన్సీ, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సులో జీ–20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫైనాన్సింగ్‌లలో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను చర్చించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వాలు సమగ్ర, స్థిరమైన నగరాల కోసం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆర్థిక సాయం చేయడానికి అవసరమైన సామర్థ్యాలపై దృష్టిసారించారు. వర్క్‌షాపు మొదటి సెషన్‌లో భారత్ సహా సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్ నిపుణులు తమ దేశాల్లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రదర్శించారు. సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్‌లోహ్.. సింగపూర్ విధానాలు, సమ్మిళిత, స్థిర నగరాలను నిర్మించే వ్యూహాలను సమర్పించారు. ఇందులో డైనమిక్ అర్బన్ గవర్నెన్స్ సిస్టంతో సహా జీవించడం, ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లానింగ్, అభివృద్ధి, వ్యర్థాలు, నీటి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విద్య తదితర అంశాలపై వివరించారు. సెషన్ అనంతరం దక్షిణ కొరియా ప్రతినిధులు పట్టణాభివృద్ధి, ఫైనాన్సింగ్ లపై సవాళ్లు, ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడంపై మాట్లాడారు.

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

- అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి
- ఏపీకి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి
- రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ రూ.36,625 కోట్లు ఇవ్వాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం జగన్ వినతి


ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నిర్ధారించిన రూ.55,548 కోట్లకు వెంటనే ఆమోదం తెలపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రంతో చర్చించేందుకు బుధవారం ఢిల్లీకి వచ్చిన ఆయన గురువారం ఉదయం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, బకాయిల అంశాలతో పాటు ప్రత్యేక హోదా అంశాలపై సుమారు అర గంట పాటు చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రం వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, ఈ నిధులనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2,600.74 కోట్లను సత్వరమే రీయింబర్స్ చేయాలన్నారు. సీఎం జగన్ ఇంకా ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

- రుణాల విషయంలో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు సరికాదు. వీటి విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుత ప్రభుత్వ తప్పు లేకున్నా, రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించారు. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు వెంటనే మంజూరు చేయాలి.
- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. ఈ డబ్బును వెంటనే ఇప్పించాలి.
- 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్లు పెండింగులో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

తాడేపల్లి చేరుకున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకుని గురువారం తిరిగి తాడేపల్లికి చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ఈ నెల 29న మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. బుధవారం రాత్రి అమిత్‌షాను కలిశారు. గురువారం ఉదయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్నారు.

8, 9వ తేదీల్లో యంగ్ లీడర్స్ వర్క్‌షాప్

కొత్తగూడెంరూరల్: జీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన వచ్చేనెల 8, 9వ తేదీల్లో యంగ్ లీడర్స్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు గడల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కాలేజీ ఆడిటోరియంలో జరిగే వర్క్‌షాప్‌నకు రాజకీయాల్లో రాణించాలనే తపన ఉండి, పదో తరగతి విద్యార్హత ఉన్న 18 నుంచి 35 ఏళ్ల వారు హాజరుకావొచ్చని, పేర్ల నమోదు కోసం 90000 37676 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి టోర్నీకి ఎంపిక


లోకేష్ సహస్ర కీర్తి

బోనకల్: బాల్ బ్యాడ్మింటన్ జూనియర్స్ 67వ జాతీయస్థాయి టోర్నీకి ఖమ్మం జిల్లా బోనకల్ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు సహస్ర, కీర్తి, బాలుర జట్టుకు లోకేష్ ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, కోచ్ అమరేసి లింగయ్య గురువారం తెలిపారు. వచ్చేనెల 30 నుంచి మహారాష్ట్రలోని ఆకోలాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

కిన్నెరసానిలో టీఎస్ఈఆర్సీ చైర్మన్


కిన్నెరసానిలో బోటుషికారు చేస్తున్న శ్రీరంగారావు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీఎస్ఈఆర్సీ) చైర్మన్ టి.శ్రీరంగారావు కుటుంబసభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీర్‌పార్కులోని దుప్పులు, ప్రాజెక్టు పైనుంచి జలాశయాన్ని వీక్షించడంతో పాటు కాసేపు బోటు షికారు చేశారు.

జిల్లా వార్తలు

పండితపామరుల సంత!


కొనుగోలు, అమ్మకందారులతో సంతలో రద్దీ


సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన మేకలు..


ఆవులు

ఒక గ్రామంలో జరిగే సంత... మూడు దశాబ్దాలకు చేరుతున్న చరిత్ర.. ఏటా రూ.2కోట్లు దాటుతున్న వేలం.. వారానికి రూ.5 లక్షలకు పైగా వ్యాపారం.. రకం రశీదులు ఇచ్చేందుకే వంద మంది విధులు.. రెండు రాష్ట్రాల నుంచి కొనుగోలు, అమ్మకందారుల రాక.. ఇలా చెప్పుకుంటూ పోతే ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పండితాపురంలో జరిగే వారాంతపు సంత విశేషాలే అన్నీఇన్నీ కావు! ఆ వివరాలు, విశేషాలు తెలుసుకుందాం..

– ఖమ్మం డెస్క్

- పశువులు, మేకల క్రయవిక్రయాలకు ఉమ్మడి ఏపీలోనే మంచి పేరు
- రూ.లక్షలు దాటి రూ.2కోట్లకు పైగా పలుకుతున్న వేలం
- ప్రతీ బుధవారం సంత.. రూ.5లక్షల మేర ఆదాయం
- వేల మందికి ఉపాధి మార్గంగా పండితాపురం సంత

ముప్పై ఏళ్లకు చేరువలో...

కొమ్మినేపల్లి జీపీ పరిధి పండితాపురంలో 28ఏళ్ల క్రితం పశువుల క్రయవిక్రయాల కోసం సంత మొదలుపెట్టారు. అప్పట్లో సంత నిర్వహణ బాధ్యతలు చేపట్టిన వ్యక్తి కుమారుడి పేరు శ్రీకృష్ణప్రసాద్ కావడం.. గ్రామానికి చెందిన ఓ రాజకీయ నేత పేరు కూడా కావడంతో ఆ పేరుతో సంతను పిలవడం ప్రారంభమైంది. అయితే, తొలి నాళ్లలో కేవలం పశువుల కోసం సంత ఏర్పాటుచేసినా... ప్రతీ బుధవారం జరిగే సంతలో ఇప్పుడు ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదనే చెప్పాలి. దీంతో ఇటు తెలంగాణ, అటు ఏపీలోని అన్ని ప్రాంతాల నుంచి వ్యాపారులు, రైతులు వచ్చి కొనుగోళ్లు చేయడం.. కొందరు మారుబేరానికి వస్తుండడం ఆనవాయితీగా మారింది.

పోటాపోటీ.. గ్రామానికి లాభాల పంట

సంత నిర్వహణ ప్రదేశం ఏజెన్సీ కావడంతో నిర్వహణ బాధ్యతలు కేవలం గిరిజనులకే ఇవ్వాలన్న నిబంధన ఉంది. దీని ఆధారంగా ఏటా జరిగే వేలంలో వీరినే అనుమతిస్తారు. కానీ రానురాను సంత వేలం పాట రూ.వేలు, రూ.లక్షలు దాటి రూ.కోట్లకు చేరడంతో అంత స్తోమత లేక గిరిజనులు జట్టుగా ఏర్పడి వేలంలో పాల్గొంటారు. ప్రతి బుధవారం రూ.3లక్షలు మొదలు రూ.5లక్షల మేర ఆదాయం నమోదవుతుండడంతో సంత నిర్వహణను దక్కించుకునేందుకు పోటీ కూడా అదే స్థాయిలో ఉంటోంది. ఇలా పోటీ పడుతుండడంతో గ్రామపంచాయతీకి కూడా ఆదాయం దండిగానే దక్కుతోంది. సంత వేలం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామంలో సీసీ రోడ్లే కాక ప్రత్యేకంగా బైపాస్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, జీపీ భవనం, సంతలో షెడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పన సులువైంది.

పశువులే కాదు... సూపర్ మార్కెట్!

ఉమ్మడి ఖమ్మంతో పాటు తెలంగాణలోని చుట్టుపక్కల జిల్లాలే కాదు.. ఏపీలోని జిల్లాల నుంచి కూడా పండితాపురం సంతకు వ్యాపారులతో పాటు ప్రజలు రావడం ఆనవాయితీగా మారింది. ఎవరి ఇంట్లో ఏ వేడుక జరిగినా మేకల కొనుగోలుకు పండితాపురం బాట పట్టాల్సిందే. వేల సంఖ్యలో రైతులు, సాధారణ ప్రజలు వస్తుండడంతో కాలక్రమంలో పశువులు, మేకలే కాక అన్ని సామగ్రి విక్రయించడం మొదలైంది. పశువుల అలంకరణ వస్తువులు, రైతులకు ఉపయోగపడే పనిముట్లు, ఇళ్లలోకి కావాల్సిన కిరాణం సామగ్రి, కూరగాయలు.. ఇలా చెప్పుకుంటూ పండితాపురం సంతలో సూపర్‌మార్కెట్‌లో లభించేవన్నీ ఏ ఒక్కటి తక్కువ కాకుండా కొనుక్కోవచ్చు. కాగా, పది మందికి పైగా కలిసి సంత వేలం దక్కించుకుంటుండగా.. ప్రతీ బుధవారం సంతలో రశీదులు ఇవ్వడం, ఇతర బాధ్యతలు చూసుకునేందుకు వంద మందిని నియమించి ఉపాధి కల్పిస్తుండడం విశేషం.

మేకపోతులు కొనుగోలు చేస్తాం



మా ప్రాంతంలో మేకపోతులు దొరకవు. అందుకే ప్రతీ వారం ఇక్కడకు వచ్చి వందకు పైగా మేకపోతులు కొనుగోలు చేస్తాం. ఇక్కడి ధరపై కాస్త లాభం చూసుకుని మా వద్ద అమ్ముకుంటాం. ఇదే మాలాంటి వారికి జీవనాధారంగా మారింది.

– ఎస్.సత్యం బంగారురాజుపేట, విజయనగరం జిల్లా

కనుల పండువగా తెప్పోత్సవం


లకారం చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి

- లకారం చెరువులో శ్రీసీతారామచంద్ర స్వామి విహారం
- భారీగా తరలివచ్చిన భక్తులు

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం గురువారం రాత్రి ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు తరలిరాగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీసీతారాములను నగరంలోని పర్ణశాల రామమందిరం నుండి శోభాయాత్రగా ట్యాంక్‌బండ్‌కు తీసుకొచ్చారు. అనంతరం మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపై శ్రీ సీతారామ స్వామిని కొలువుదీర్చి లకారం చెరువులో విహరింపజేశారు. ఈసందర్భంగా స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు జై శ్రీరామ్ అంటూ చేసిన నినాదాలతో ట్యాంక్‌బండ్ ప్రాంతం మార్మోగింది. శ్రీసీతారాములకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక పూజలు చేశారు. మూడేళ్ల తర్వాత లకారం ట్యాంక్‌బండ్‌లో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించగా.. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు ఇబ్బంది పడకుండా కేఎంసీ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సుడా చైర్మన్ విజయ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, తహసీల్దార్ శైలజ, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్ దంపతులు


పూజలు చేస్తున్న సీపీ వారియర్ దంపతులు, మేయర్ నీరజ, తదితరులు

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

దుమ్ముగూడెం: భద్రాచలంలో శుక్రవారం జరగనున్న శ్రీరామచంద్రస్వామి పుష్కర పట్టాభిషేకంలో పాల్గొననున్న గవర్నర్ తమిళిసై, ఆతర్వాత పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకోనున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పాటు భద్రాచలం నుంచి పర్ణశాలకు వచ్చే క్రమంలో ఏపీ మీదుగా ప్రయాణించాల్సి ఉండడంతో బందోబస్తుపై పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే ఆలయంలోకి వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించారు. కాగా, ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఓఎస్డీ సాయి మనోహర్ గురువారం పర్ణశాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. సీఐ దోమల రమేష్, ఎస్సై రవికుమార్, కేశవ్‌రావు పాల్గొన్నారు.


పర్ణశాలలో ఎస్పీ వినీత్, పోలీసు అధికారులు

జమలాపురంలో వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామచంద్రస్వామి, సీతాదేవిని పల్లకీలో మండపం వద్దకు తోడ్కొని వచ్చి పూజలు చేశారు. ఆతర్వాత భద్రాచలం ఆలయం నుంచి వచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఈఓ జగన్మోహన్‌రావు, సర్పంచ్ ముల్పూరి స్వప్న దంపతులు అందచేశారు. అనంతరం అర్చకులు కురవి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, ఉప్పల మురళీ మోహన్‌శర్మ నేతృత్వాన కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆతర్వాత ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై ఊరేగించారు. ధర్మకర్తలు ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు విజయదేవశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.